# 4. కనిపించనవసరము లేదు !

**మా** ఎదురింటి సుబ్బారావు ఎంతో హడావిడిగా మా ఇంటికొచ్చాడు. అసలే బెంగుళూరు మిరపకాయలాంటి మొహం వాడిది. ఇప్పుడు మరీ ఒడిలిపోయిన చిక్కుడాకులా తయారయింది. ఏదో ఉపద్రవం జరిగిపోయిందని తెలుస్తూనే ఉంది. వాళ్ళబ్బాయి బాబా రెండ్రోజులై ఇంటికి రాలేదట.

బాబాకీ, సుబ్బారావు తల్లి బలభద్రమ్మగారికీ క్షణం పడదు. "వాణ్ణేమీ అనకే, వాడు నాకొక్కగానొక్క కొడుకే" అని సుబ్బారావెంత గోలపెట్టినా ఆవిడ వినదు.

'నువ్వూ నాకు ఒక్కగానొక్క కొడుకువే. ఆ రోజుల్లో ఎవరికైనా ఒక్కగానొక్క కొడుకులే. ఒక్క కొడుకే అని చెప్పుకుంటే చాలు. సంధి పేలాపన జోడించి 'నొక్క' బలికితేగాని తెలియదా ఏం?' అని ఖస్సున లేస్తుంది. ఆ వయసులో ఆవిడకి మాంచి ఆరోగ్యమే కాదు, పదెకరాల పల్లపు భూమికూడా ఉంది. ఏవిధంగానూ నోటిని కట్టుకోవడం ఎరగని ధన్యజీవి ఆమె.

'నిత్య హాయీ బాబా'కి చదువైతే అంతగా వంట బట్టలేదు గాని నేటివిధానంమీద కొన్ని నిశ్చితాభిప్రాయాలున్నాయి. వాడి దృష్టిలో ఏ మేష్టారూ తిన్నగా పాఠాలు చెప్పిచావడు. చెప్పే పాఠాలు తక్కువా, కొట్టుకునే సొంత డబ్బా ఎక్కువా. అవసరాన్ని మించి టీచర్లు అరిచారంటే దాని అర్థమేమిటి, ఏరోజుకారోజు ఇంట్లో పెళ్ళాంచేత ఫ్రెష్‌గా చివాట్లుతిని వచ్చారనేగా!

అయినా అంతగా కిటకిటలాడిపోతున్న క్లాసులో కిరకిరలాడుతూ శబ్దంచేస్తున్న సీలింగ్ ఫ్యానుల గోలలో ఏం వినిపించి చస్తుంది గనక! బుద్ధిమంతుడైన విద్యార్థి అక్కడ ఎలా కూచోగలడని! అందుకని ముందుగా ఎటెండెన్సు ఏర్పాటుచేసుకుని, పక్క కిటికీలోంచి చల్లగా బయటకి జారుకుంటాడుట.

ఇక వీడితోపాటు బైటిచెట్లనీడల్లో చేరిన కుర్రాళ్ళకి అతిరహస్యంగా దమ్ముకొట్టుకోవాలని ఉంటుందిగానీ, క్లాసులో కుమ్ముకోవాలని వుంటుందా!

కర్మంచాలక క్లాసులో బందీ అయిపోయినా ఆ రొటీనువరుసలో బుర్రపాడైపోవడంతప్ప ఏమైనా ఎక్కుతుందా! ఎలాగో ఉగ్గబట్టుకుని చచ్చీచెడీ బుర్రకెక్కించుకుని, గుర్తుంచుకుని, పరీక్షల్లో 'కక్కినా' పేపర్లు ఏ ఏడాదే సరిగా ఇవ్వరు. ఇచ్చినా సవ్యంగా దిద్దరు.

ఇక పేపర్లు లీకు అవడాలూ ఏ పాపం ఎరగని అమాయకపు విద్యార్థులమీద రీ ఎగ్జామినేషను శిక్షలూ, ఇవన్నీ ఎవరితో చెప్పుకోవాలి! ఇంతకీ ఎగ్జామినేషనంటే ఎంత జ్ఞానముందనికాక, పరీక్ష హాల్లో 'ఎంతబాగా వాంతి చేసుకున్నాడని!' ఏం ఎగ్జామ్సు ఇవి!

కాపీకొట్టేడని వేలెడు కుర్రాణ్ణి అన్యాయంగా డిబారుచెయ్యడం ఎరుగుదురు, పేపర్లు సరిగ్గా ఇవ్వక, దిద్దక వేలాది విద్యార్థుల జీవితాలతో ఆటలాడే 'లీకు' వీరుల మీద చర్యతీసుకునే సత్తా ఏ విద్యాధికారికి కూడా లేదు!

ఇలాంటి ఆలోచనల రొద మరీ ఎక్కువై బాబాని కుంగదీసేది. పై పెదవి పైన ఏర్పడిన నలుపు చిరుమీసంగా రూపుదిద్దుకుని, అది అటూ ఇటూ డెయిలీ షేవ్‌చేసే స్టేజికి చేరుకుందిగానీ మెట్రిక్‌దాటడంమాత్రం వాడివల్లకాలేదు.

ఆ చాతకానితనం అంతా తల్లిమీదా, ముఖ్యంగా మొదటేడే మంచి మార్కులతో మెట్రిక్ పాసైన చెల్లిమీదా, అర్థంలేని అలకగా మారింది. తండ్రి సుబ్బారావుకి తనంటే ఎప్పుడూ ఇష్టమేకాని చీకటితో ఆఫీసుకి బయల్దేరి రాత్రికిగాని ఇల్లు చేరనివాడు తననెలా ఆదుకోగలడు!

తల్లెప్పుడూ ఏదో పనిలో లీనమైవుంటుంది.

ఈ మధ్యనే కాలేజీలో చేరిన చెల్లి అయితే ఇంటి పట్టున ఉండదు. ఇక నానమ్మ ఓ కొరకర్రాని కొయ్య! ఆనాడు లంకాపురాన్ని కాపలాకాసిన లంకిణిని మించిన నిత్య శంకిణి! ఎవరూలేరు కదా అని నలుగురు ఫ్రెండ్సుని తెచ్చుకుని ఇంట్లో చిన్నపార్టీ చేసుకోనివ్వదు. తండ్రిచ్చిన డబ్బులైనా స్వేచ్ఛగా ఖర్చు పెట్టకోనివ్వదు!

వయసు పైబడినా ఈ ముసిలాళ్ళు ఇంకా ఇంకా ఎందుకు బతికేస్తూ ఉంటారో! నానమ్మని ఎదుర్కోడానికి ఒకటీ ఒకటీ బ్లాక్ మెయిలింగ్ మెథడ్సుకి సిద్ధపడక బాబాకి తప్పలేదు మరి. వాడిప్రయత్నాలూ ఆవిడ తిప్పికొట్టడాలూ ఇంచుమించు ఇలా ఉండేవట.

"నా మనసు పాడైపోయింది. ఎందుకోగానీ ఇవాళ భోంచెయ్యాలని లేదు నానమ్మా"

"ఇన్నాళ్ళకి ఎంత చక్కని నిర్ణయం తీసుకున్నావ్‌రా, ఎక్కువగా తినేస్తూంటే మనసు పాడైపోదా మరి! ఇప్పటికైనా ప్రతీ ఏడూ ఫెయిలయిపోతున్నాననే ఆలోచన అల్లరిపెట్టి, నిన్నలా అనిపించేలా చేస్తోందేమో, కరెక్టే. ఏ ట్యుటోరియల్ స్కూల్లోనో వెంటనే చేరతానంటావా, సుబ్బిగాడితో చెబుతానుండు"

"అబ్బే! అదికాదు నానమ్మా....ఇంట్లోఉంటే మాత్రం....నిద్రెక్కడ పట్టిచచ్చింది?"

"మరి చెప్పవేం అలా! నిద్ర ఆపుకోలేక చెడిపోయిన కుర్రాళ్ళు నాకు తెలిసిన వాళ్ళెందరో ఉన్నారు. ఈ వయసులో నిద్రపట్టకపోడం ఎంత అదృష్టం! ఈసారైనా శ్రద్ధ పెట్టిచదువు. తప్పక పాసవుతావు"

"అబ్బబ్బా, చదువు ఊసు ఎత్తొద్దంటే!

"పోనీ పెళ్ళిచేసెయ్యమంటావా! పిల్లల్ని చకాచకా కని వాళ్ళచేతైనా హాయిగా చదివించుకుందువు!"

నానమ్మ ఈ చివరి హాస్యపుచురక బెడిసికొట్టినట్టుంది. మీసమున్న మగాణ్ణని రుజువు చెయ్యాలనే తపన మరింత పెరిగినట్టయింది. అలిగి ఆ రోజు భోజనం మానేశాడు. తల్లిదండ్రులుగాక చెల్లికూడా బ్రతిమాలడం వాడికి మరింత బలం ప్రసాదించినట్టైంది.

కావలసిన డబ్బిచ్చి వాడు కోరుకున్న పద్ధతిలో ఖర్చు పెట్టడానికి దారేదో స్పష్టంగా

తెలిసినట్టైంది. అంతే. ఆ పొద్దున్నే ఇంటినుంచి ఉడాయించాడు. తండ్రి పర్సులో రెండొందలు సంగ్రహించి. ఇవన్నీ పూసగుచ్చినట్టు నాతో చెప్పుకుని గోల పెట్టేడు సుబ్బారావు.

రెండ్రోజులు గడిచినా వాడు రాకపోతే ఇక లాభంలేదనుకుని ఓ ప్రకటన రాసి నా దగ్గరకి తెచ్చాడు. పత్రికకి ఇవ్వమని, వీలైతేమార్పుచెయ్యమని, సుబ్బారావుని వెళ్ళనిచ్చి అదేదో విప్పిచూశాను. షరామామూలే. **కనిపించుట లేదు.**

**నాయనా, నిత్య హోయ్!**

బాబూ, నువ్వు వెళ్ళిననాటినుండి మీ అమ్మ మంచము దిగుటలేదు. మీ నానమ్మను ఇకముందు నిన్నేమీ అనకుండా కట్టుదిట్టము చేసెదము. నువ్వెక్కడున్నా ఇదిచూచి వెంటనే రాగోరెదము. నీకొరకు నిద్రాహారములులేక విలపించుచున్న నీ తల్లిదండ్రులు, చెల్లి, నానమ్మ ఈ ఫోటోలో వున్న వ్యక్తి ఆచూకీ తెలిపిన వారికి తగిన బహుమానము ఇవ్వబడును. "

అంటూ ఆ కాగితం నాకిచ్చి సుబ్బారావు వెళ్ళిపోయాడు.

ఇంకా నేనది పూర్తిచేశానో, లేదో బలభద్రమ్మగారు, అదేవాళ్ళ నాయనమ్మ, వచ్చింది "మావెర్రిసుబ్బి ప్రకటన కోసం నీ దగ్గరకి వచ్చాడా! తల్లిదండ్రుల మమకారాల్ని సొమ్ముచేసుకునే అవకాశం మాత్రం ఓసారి రుచిచూపిస్తే ఇక ఆ కుర్రవెధవలు బాగుపడ్డట్టే!"

ఇలాంటి వాళ్ళ రోగానికి తగినమందు నా దగ్గరుంది. అదికాదు ఇలా ప్రకటన ఇయ్యి" అంటూ రాసి తీసుకొచ్చి చూపించింది. రాసింది చింపేసి, సబువనిపించి అలాగే ప్రకటించాను.

**కనిపించనవసరం లేదు!** ఈ క్రింది ఫోటోలో వున్న పద్దెనిమిదేళ్ళ బాబా అనే కుర్రవాడు కనుక మీకు తటస్థపడినచో మేమిప్పుడిచ్చే సమాచారము వాడికి అందించగోరెదము. ముందుగా అందించినవారికి తగిన బహుమతి ఇవ్వబడును.

కుర్రవాడు చెడుదారినపడినాడని కుటుంబసభ్యులు ఒక నిర్ణయమునకువచ్చి అతనితో తెగతెంపులు చేసుకోవడమైనది. కుర్రవాని తండ్రి పిత్రార్జితముతోపాటు నానమ్మ పేరే వున్న పదెకరాల మాగాణీ కలిపి చెల్లిపేర వ్రాయుటకు అన్ని ఏర్పాట్లు జరుగుచున్నవి.

ఇట్లు కుటుంబసభ్యులు .

ఈ కథ వినిపించింది నేనైనా, నడిపించింది మాత్రం సాక్షాత్తూ బలభద్రమ్మగారే. ఇంకేముంది, మర్నాటి ఫస్ట్‌బస్‌లో బాబా స్వగృహంలో ప్రత్యక్షం!

★